# పేదలకు వైద్య సేవలకు ప్రాముఖ్యత

## • శాసనసభ్యులు తీగుల్ల పద్మారావు గౌడ్



**ప్రజానావ, సికింద్రాబాద్ :** పేద రోగులను ఆదుకొనేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధిని తాము సద్వినియోగం చేసుకుంటామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన గర్ దాసు లక్ష్మి (మెట్టుగూడ), వెంపటి శారద (మైలా రాగడ్డ) మన్సూర్ అక్రం మహమ్మద్ (నార్త్ లాలాగూడ), రోకటి ఉమా చంద్రశేఖర్ (నామాలగుండు) లు అస్వస్థతకు గురై, సితఫలమండీ లోని ఎం.ఎల్.ఏ. క్యాంపు కార్యాలయాన్ని సహాయానికై ఆశ్రయించారు. వెంటనే స్పందించిన శాసనసభ్యులు పద్మారావు గౌడ్ వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నిమ్స్ ఆసుపత్రిలో వైద్య సేవలను పొందేందుకు వీలుగా ఎల్.ఓ.సి. పత్రాలను తన కార్యాలయంలో అందించారు. మన్సూర్ అహ్మద్ కు రూ. రెండు లక్షలు, రోకటి ఉమచంద్ర శేఖర్ కు రూ. రెండు లక్షలు, వెంపటి శారదకు రూ.1.10 లక్షలు, లక్ష్మికి రూ.3.50 లక్షల మేరకు మొత్తం రూ. 8.60 లక్షల విలువజేసే ఎల్.ఓ.సీ. పాత్రలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు వైద్య సేవలను అందించడంలో తాము అగ్ర స్థానంలో నిలుస్తామని అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన ప్రజల సమస్యల పరిష్కారానికి సితాఫలమండిలోని తమ క్యాంపు కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు, అధికారులు పాల్గొన్నారు.



# రేణుకా ఎల్లమ్మ సిద్ధం

## ప్రభుత్వ విప్ ఆది హాజరు

**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ పట్టణ పరిధిలోని నాంపల్లిలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ తల్లి సిద్ధం (జాతర) బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేడుకల్లో భాగంగా అమ్మవారిని దర్శించుకున్న ఆయన, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ఆశ కార్యకర్తల సమస్యలపై చర్యలు



**ప్రజానావ, సికింద్రాబాద్ :** ఆశ కార్యకర్తల సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం పై వత్తిడి తెస్తామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. తుకారం గేటు అర్బన్ హెల్త్ సెంటర్ కు చెందిన ఆశా వర్కర్ లు బుధవారం సితఫలమండీ లోని ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో పద్మారావు గౌడ్ తో సమావేశమై వివిధ సమస్యల పై వినతి పత్రాన్ని అందించారు. వేతనాలు పెంచాలని, పని వత్తిడి తగ్గించాలని, వివిధ టార్గెట్ లను నివారించాలని విజ్ఞప్తి చేశారు. వారి సమస్యలని వెంటనే ప్రభుత్వ దృష్టికి తెచ్చి పరిష్కరిస్తామని పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# విద్యార్థులకు పరీక్ష కిట్లు




**ప్రజానావ, హైదరాబాద్:** ఫైవ్ ఫింగర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 10వ తరగతి చదువుతున్న 500 మంది విద్యార్థులకు పరీక్ష కిట్ల పంపిణీతో పాటు ప్రేరణాత్మక సదస్సు నిర్వహించారు. పరీక్షల సమయంలో అవసరమైన పెన్, పెన్సిల్, స్కేల్ తదితర సామగ్రి ఉన్న కిట్లను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ పి. వినయ్ కుమార్ (గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్), డాక్టర్ బిక్షం (ICRISAT శాస్త్రవేత్త), రాయ్‌దాస్ రాయ్ మంతెనా (ఎన్.ఆర్.ఐ.), అరుణ్ డానియల్ (యంగిస్తాన్ ఫౌండేషన్ చైర్మన్), దాసరి శ్రీనివాస్ (సామాజిక కార్యకర్త, కాళోజీ టీవీ చైర్మన్), సంపత్ (న్యూస్ సీనియర్ అనలిస్ట్) పాల్గొన్నారు. వారు విద్యార్థులతో మాట్లాడి చదువులో కృషి, లక్ష్య సాధన, క్రమశిక్షణ గురించి సూచనలు ఇచ్చి జీవితంలో విజయం సాధించే మార్గాలను వివరించారు. ఈ సందర్భంగా ఫైవ్ ఫింగర్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని తెలిపారు.



# ఐదేళ్ల బాలికపై లైంగిక దాడి

**ప్రజానావ, ఖమ్మం:** ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో ఐదేళ్ల బాలికపై 45 ఏళ్ల వ్యక్తి లైంగిక దాడికి పాల్పడిన అమానుష ఘటన వెలుగుచూసింది. తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయాన్ని గమనించిన నిందితుడు బాలికను లోబర్చుకుని ఈ దారుణానికి పాల్పడినట్లు తెలిసింది. నిందితుడి పైశాచికత్వానికి గురైన చిన్నారి తీవ్ర రక్తస్రావంతో బాధపడింది. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చిన తల్లిదండ్రులకు బాలిక జరిగిన విషయాన్ని చెప్పడంతో, వారు వెంటనే ఆమెను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని కలిగించింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిపై పోక్సో చట్టం కింద కఠినమైన సెక్షన్లతో కేసు నమోదు చేశారు. బాధితురాలికి మెరుగైన వైద్య సహాయం అందిస్తూనే, నిందితుడిని అదుపులోకి తీసుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ఈ ఘటనపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిందితుడికి కఠిన శిక్ష విధించాలని, బాధితురాలికి త్వరితగతిన న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు సమాజంలో నైతిక విలువల పతనాన్ని సూచిస్తున్నాయని, చిన్నారుల భద్రతపై తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని స్థానికులు పేర్కొన్నారు. పోలీసులు కేసును విచారించి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఓటర్ల జాబితా ప్రక్షాళనే లక్ష్యం

## • జూబ్లీహిల్స్‌లో బీజేపీ బీఎల్ఏ-2 కీలక సమావేశం



**ప్రజానావ, జూబ్లీహిల్స్:** ఎన్నికల ప్రక్రియలో కీలకమైన ఓటర్ల జాబితా పారదర్శకత కోసం భారతీయ జనతా పార్టీ సమరశంఖం పూరించింది. జూబ్లీహిల్స్ డివిజన్ సాగర్ సొసైటీలోని బీజేపీ క్యాంప్ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్ అధ్యక్షతన బిఎల్ఏ-2 ప్రతినిధుల కీలక సమావేశం బుధవారం నిర్వహించింది. సమావేశంలో ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు భోజి రెడ్డి, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం వెంకట్ స్వామి, కొత్త నీరజ హాజరై మాట్లాడారు. ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో బిఎల్ఏ-2లు నిర్వర్తించాల్సిన బాధ్యతలను వివరించారు. దేశవ్యాప్తంగా సాగుతున్న 'ఎస్ఐఆర్' కార్యక్రమంలో భాగంగా ఓటర్ల వివరాలను సరిచూడడం అత్యంత కీలకమని వారు స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ నియమించిన బీఎల్ఓలతో నిత్యం సమన్వయం చేసుకుంటూ ఓటర్ల వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలిస్తూ.. ఒకే పేరుతో ఉన్న దొంగ ఓట్లు, మరణించిన వారి వివరాలు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్లను గుర్తించి వారి వివరాలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నాయకులు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. బూత్ స్థాయిలో పకడ్బందీగా పనిచేస్తేనే ఓటర్ జాబితా పారదర్శకంగా ఉంటుందని, అప్పుడే ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరుగుతాయని వారు అభిప్రాయపడ్డారు. ప్రతి బిఎల్ఏ-2 బాధ్యతగా తమ బూత్ పరిధిలో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఏ-2 ప్రతినిధులు సీతల అనిల్ కుమార్, కస్తూరి మహిపాల్ రెడ్డి, దొంగరి రాజకళ, చెలిమెట్టి గిరి, గుంటి ఆనంద్ సాగర్, వలిశెట్టి రాంబాబు, మంజలి నరసింహా, గొల్లి రమ్య, ఉపేంద్ర, రమేష్, బాలరాజు, ప్రహ్లాదు, ప్రవీణ్, రమాదేవి, లక్ష్మీనారాయణ, యాదగిరి, సాయి కుమార్, గౌడ నాయక్, మల్లేష్, రాము యాదవ్, రాజేందర్, తిరుపతి, భీమేష్ యాదవ్, శ్రీకాంత్, చంద్రశేఖర్, దొంగరి నవ్య, వరికుప్పల వెంకటేష్ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ఎండీఎం కార్మికులకు 10వేల వేతనం అమలు చేయాలి

## 16న చలో హైదరాబాద్‌కు ఏఐటీయూసీ పిలుపు




**ప్రజానావ, సత్తుపల్లి:** మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల వేతనం అమలు చేయాలని ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకుడు నిమ్మటూరు రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం వేతన పెంపును వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఈనెల 20న ప్రవేశపెట్టే రాష్ట్ర బడ్జెట్‌లో మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాల కోసం నిధులు కేటాయించాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కార్మికుల సమస్యల సాధన కోసం ఈనెల 16న నిర్వహించే "చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం సత్తుపల్లి మండల విద్యా శాఖ అధికారి నక్క రాజేష్ రావును కార్మికులతో కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. 24 సంవత్సరాలుగా పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు ఇప్పటివరకు గుర్తింపు కార్డులు, అపాయింట్మెంట్ లెటర్లు లేవని పేర్కొన్నారు. ప్రభుత్వం వారిని అధికారికంగా కార్మికులుగా గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే రహీమ్ ఉన్నిసా, మహాదేవ లక్ష్మి, జక్కంపూడి వెంకటలక్ష్మి, జై నాగమ్మ, సీపీఐ మండల పార్టీ కార్యదర్శి తడికమల యోబు, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

# హమాలి మహా గర్జనను జయప్రదం చేయండి

## మీడియా సమావేశంలో తెలంగాణ హమాలి వర్కర్స్ యూనియన్ పిలుపు పిలుపు



**ప్రజానావ, సిరిసిల్ల :** తెలంగాణ రాష్ట్రంలో 10 లక్షల మందికి పైగా హమాలి కార్మికులు పని చేస్తున్నారు. లోడింగ్, అన్ లోడింగ్ శ్రమదోపిడి చేస్తూ తద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో హమాలీలు కీలకపాత్ర పోషిస్తున్నారు. తమ డిమాండ్ల సాధన కోసం ఆర్ట్స్ 15న హమాలీ మహా గర్జన నిర్వహిస్తున్నట్టు సిరిసిల్ల ప్రెస్ క్లబ్ లో జరిగిన మీడియా సమావేశంలో హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు వెల్లడించారు. ఈ సందర్భంగా తమ సమస్యలను వెల్లడించారు. మార్కెట్ యార్డులు, పెస్టిసైడ్ గోదాములు, సిమెంట్ గోదాంలలో ధాన్యం సేకరణ కేంద్రాలు, వ్యాపార స్థలాలలో కార్మికులు పని చేస్తూ అంతగా శ్రమిస్తున్న హమాలి కార్మికుల జీవితాలలో మెరుగుదల లేకపోవడం, కార్మికుల కుటుంబాలు చిన్న వయసులోనే తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారు. గత ప్రభుత్వం హమాలీ కార్మిక గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. హమాలి కార్మికులకు సమాన పనికి సమాన వేతనం కూడా అమలు కాలేదు. ఇతర రాష్ట్రాల నుండి కార్మికులు రావడం వల్ల మొత్తం హమాలి కార్మికుల మధ్య పోటీ పెరిగింది. హమాలి కార్మికులకు అందే వేతనాలు మరింతగా పడిపోయే పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడున్న ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని విశ్వాసంతో కాంగ్రెస్ పార్టీ తెలుసుకోవడానికి తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ అనేక రూపాలలో కృషిచేసి చేస్తున్నది. హమాలి యూనియన్ నిర్మాణాన్ని బలోపేతం చేసుకోవడానికి మన సమస్యలను ప్రభుత్వం, ప్రజాదృష్టికి తీసుకురావడానికి కాంగ్రెస్ పార్టీ హమాలి కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయడానికి మార్చి15 న నిర్వహించబోయే హమాలీ మహా గర్జన ను హనుమకొండ, వరంగల్ పట్టణంలో నిర్వహించబోయే సభను హమాలి కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరుతున్నామని యూనియన్ నాయకులు కోరారు. ఈ సమావేశంలో అన్నాడి వెంకట్ రెడ్డి (తెలంగాణ హమ్మవారి వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రెటరీ), జంగా సంపత్ యాదవ్ (పెద్దపల్లి జిల్లా బాధ్యులు), కామ భూమయ్య పెద్దపెల్లి జిల్లా కార్యదర్శి, కొమ్ము మధుకర్ కరీంనగర్ జిల్లా బాధ్యులు, ఎడ్ల విశాన్ సిరిసిల్ల జిల్లా బాధ్యులు, నగునూరి భాను సిరిసిల్ల హమాలి కార్మిక సంఘం అధ్యక్షులు, కులిపురం రమేష్ ఉపాధ్యక్షులు, గడ్డి దేవయ్య కోశాధికారి, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

# జనాభా లెక్కల విధులు సరిగ్గా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజానావ, మంచిర్యాల:** జనాభా లెక్కల విధులు సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి జిల్లాలోని మండలాల తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేయబోయే సంక్షేమ పథకాలను సమర్ధవంతంగా అమలు చేసేందుకు జనాభా లెక్కల ప్రాతిపదిక ఉపయోగపడుతుందని తెలిపారు. జనాభా లెక్కల విధులను సక్రమంగా నిర్వహించాలని, తద్వారా ప్రజలకు అందించాల్సిన మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలపై ప్రభుత్వానికి అవగాహన వస్తుందని పేర్కొన్నారు. జనాభా లెక్కల ప్రక్రియ నిర్వహణ, సాంకేతికత వినియోగం, ఇతర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి డిజిటల్ పద్ధతిలో జనాభా గణనను నిర్వహించడానికి చర్యలుహతీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జనగణన ప్రక్రియను పారదర్శకంగా, లోప రహితంగా పూర్తి చేయాలని, జనగణన ద్వారా సేకరించే గణాంకాలు గ్రామ, పట్టణ, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు పునాది వంటివని తెలిపారు. విద్యార్హత,హవృత్తి, సామాజిక వర్గం, మౌలిక వసతుల వివరాలు వంటి అంశాల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. మొదటి దశలో నివాస గృహాలతో పాటు అన్ని రకాల భవనాలు, కుటుంబ వివరాలను, 2వ దశలో వ్యక్తిగత వివరాలనుహా సేకరించడం జరుగుతుందని తెలిపారు. నిర్ణీత కాలపరిమితి లోపు జనాభా గణన ప్రక్రియను మెరుగైన రీతిలో పూర్తి చేయడానికి అందుబాటులో ఉన్న సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల రూపకల్పనకు దోహదపడే జనాభా గణన ప్రక్రియను నిబద్ధతతో నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా ఒప్పందంతో వ్యవసాయ రంగానికి నష్టం



**ప్రజానావ, ఆదిలాబాద్:** భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంతో తెలంగాణ వ్యవసాయ రంగానికి నష్టం జరుగుతోందని కిసాన్ కాంగ్రెస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేష్ రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న రైతు వ్యతిరేక విధానాలతో రైతాంగం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటోందని తెలిపారు. పీడీపీఎస్ అమలుకు పైలెట్ ప్రాజెక్టుగా ఆదిలాబాద్ మార్కెట్‌ను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. రైతులు పత్తిని ఎక్కడైనా విక్రయించవచ్చని, మార్కెట్ ధరలో వచ్చే వ్యత్యాసాన్ని ప్రభుత్వం భర్తీ చేస్తుందని తెలిపారు. అదేవిధంగా బియ్యాన్ని అమెరికా, అరబ్ దేశాలకు ఎగుమతి చేస్తున్నప్పటికీ, ఇతర ఉత్పత్తులు ఎక్కువగా అమెరికాకు ఎగుమతి అవుతున్నాయని చెప్పారు. తాజాగా పన్నుల పెంపు కారణంగా రైతులకు నష్టం వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా విత్తన వ్యాపార రంగంలో "భారతీయ బీజ్ సహకారి సమితి లిమిటెడ్" పేరుతో కొత్తగా ప్రవేశిస్తున్న సంస్థ ద్వారా కలిగే లాభనష్టాలపై కూడా సమావేశంలో చర్చించారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. భారత్--మెరికా ఒప్పందం ప్రభావం, కేంద్ర ప్రభుత్వ విధానాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా అధ్యక్షులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

## కల్వర్టు నిర్మాణానికి భూమిపూజ



**ప్రజానావ, తలమడుగు:** రైతుల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. తలమడుగు మండలం దేవాపూర్, పల్లి (కే)లో రైతులు తమ పొలాలకు సులభంగా వెళ్లేందుకు రూ.48 లక్షల వ్యయంతో నిర్మించనున్న కల్వర్టు పనులకు బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రైతులు తమ పొలాలకు వెళ్లే మార్గంలో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఈ కల్వర్టు నిర్మాణం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడమే ప్రజా పాలన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంతోష్, పల్లి (కే) సర్పంచ్ అశోక్, మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, మాజీ ఎంపీపీ కళ్యాణం రాజేశ్వర్, పల్లి(బి) సర్పంచ్ సంజీవ్, మాజీ ఎంపీటీసీ వెంకన్న యాదవ్, విఠల్, జి.తిరుపతి, వెంకన్న, సిల్లర్, లచ్చన్న, నర్సింలు, ఉప సర్పంచ్‌లు శ్రీరాం, లింగారెడ్డి, గంగాధర్, గంగారెడ్డి, గోవింద్, విలాస్, ప్రతాప్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి విద్యార్థులకు ఘన వీడ్కోలు

**ప్రజానావ, ఆదిలాబాద్:** తలమడుగు మండలంలోని సుంకిడి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం ఘనంగా వీడ్కోలు నిర్వహించారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు సన్మానిస్తూ వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల పీజీహెచ్ఎం జైవర్ధన్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులు తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను శాలువా, మెమెంటో, బొకే, పెన్నులు అందించి ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో వివిధ సబ్జెక్టుల్లో ఎక్కువ మార్కులు ఎలా సాధించాలో సంబంధిత ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఎస్సెస్సీ పరీక్షల్లో మండల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీకి ఎంపికైతే రూ.2వేల నగదు బహుమతి, మెమెంటో, ప్రశంసా పత్రం అందజేస్తామని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రకటించి విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కృష్ణవేణి, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు శ్రీనివాస్ స్వామి, బి.గజానన్, వై.రామిరెడ్డి, సుకుమార్ పెట్కులే, ఆర్.సుజాత, పీడీ నాందేవ్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటస్వామి, ఉపాధ్యాయులు నరేందర్, నరేష్, సత్యనారాయణ, ట్రైనీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.





# పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**ప్రజానావ, జైనూర్:** పదవ తరగతి వార్షిక పరీక్షలకు జైనూర్ మండల కేంద్రంలో అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు ఎంఈఓ జాదవ్ మధుకర్ తెలిపారు. మండలంలోని రెండు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు జెడ్పీహెచ్ఎస్, బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ రెండు పరీక్ష కేంద్రాల్లో సుమారు 452 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. పోలీస్ బందోబస్తు మధ్య ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వివరించారు.





# రోడ్డు భద్రతపై విద్యార్థుల అవగాహన

**ప్రజానావ, తాండూర్:** మండల కేంద్రంలోని విద్యా భారతి పాఠశాల విద్యార్థులు రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మానవహారం ఏర్పరచి ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిన అవసరాన్ని వివరించారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు హెల్మెట్ ధరించడం, వేగ నియంత్రణ పాటించడం, ట్రాఫిక్ సిగ్నల్స్‌కు కట్టుబడి ఉండాలని విద్యార్థులు నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మండల విద్యాధికారి శ్రీనివాస్ పాల్గొని విద్యార్థుల కార్యక్రమాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యా భారతి హైస్కూల్ డైరెక్టర్ శరత్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



**ప్రజానావ, నేరడిగొండ:** విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ముత్యాలి బాయి హమ్ము నాయక్ వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ అధ్యక్షుడు ఆడే నూర్ సింగ్ అన్నారు. బుధవారం సొసైటీ ఆధ్వర్యంలో బోథ్ మండలంలోని కనుగుట్ట గ్రామ జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని సూచించారు. ఉన్నత విద్యను అభ్యసించడంతో పాటు మానవతా విలువలను కూడా పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగయ్య, ఉపాధ్యాయులు సుభాష్ రెడ్డి, అంకిత, రాజేశ్వర్, అనిల్, సొసైటీ సభ్యులు లింబాజీ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు పశు పోషణపై దృష్టి పెట్టాలి



**ప్రజానావ, నేరడిగొండ:** రైతులు వ్యవసాయంతో పాటు పోషణపై కూడా పశు పోషణపై కూడా దృష్టి పెట్టాలని నేరడిగొండ గ్రామ సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి అన్నారు. గాలి కుంటు వ్యాధి నివారణ సామూహిక టీకాల కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని పశు వైద్య శాలలో ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువులకు సోకే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. నాటు వైద్యం వైపు వెళ్లకుండా సంబంధిత వైద్యులను సంప్రదించి వైద్యం చేయించి వాటిని కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోతి గులాబ్ సింగ్, వార్డు సభ్యులు సాబ్లే సంతోష్ సింగ్, పశువైద్యులు డాక్టర్ జీవన్ రాథోడ్, పశు వైద్యశాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



**ప్రజానావ, జైనూర్:** మండలంలోని పట్నాపూర్ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పట్నాపూర్ సర్పంచ్ కందారే లక్ష్మీ, కార్యదర్శి బాలాజీ, వార్డు సభ్యులు అంజన్నలతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో ఎలాంటి భయభ్రాంతులకు గురికాకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని సూచించారు. పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ, గ్రామ పటేల్ గంగాధర్, సంజూ, కారోబారి పావు, కృష్ణ, కమల తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఎస్పీకి సన్మానం

**ప్రజానావ, ఆదిలాబాద్:** జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌ను ఇచ్చోడ మండలంలోని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు బుధవారం జిల్లా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సాత్ నంబర్ గ్రామ సర్పంచ్ రాథోడ్ రమేష్, దేవులనాయక్ గ్రామ సర్పంచ్ లలిత రాందాస్, మాజీ ఎంపిపి రాథోడ్ రాందాస్ కలిసి ఎస్పీను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు ఆయన చేస్తున్న సేవలను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

# గిరి విద్యార్థులకు ఏఎస్పీ సేవా హస్తం

## చదవండి.. సాధించండి

## విద్యార్థులకు చిత్తరంజన్ పిలుపు

**ప్రజానావ, ఆసిఫాబాద్ :** పదవ తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న గిరిజన ప్రాంత విద్యార్థుల పట్ల ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ తన ఉదారతను చాటుకున్నారు. "పోలీసులు మీకోసం" కార్యక్రమంలో భాగంగా ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆయన పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. డివిజన్ వ్యాప్తంగా ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీల్లో చదువుతున్న సుమారు 2500 మంది విద్యార్థులకు మొత్తం 10,000 పెన్నులు, 2500 ఎగ్జామ్ ప్యాడ్లు , 2500 వాటర్ బాటిళ్లను అందజేశారు. ముఖ్యంగా పరీక్షల సమయంలో విద్యార్థులు తగినంత నీరు తాగుతూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో వాటర్ బాటిళ్లను ప్రత్యేకంగా పంపిణీ చేసినట్లు ఏఎస్పీ తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమం డివిజన్ లోని వివిధ సర్కిళ్ల పరిధిలో విస్తృతంగా సాగింది. జైనూర్ సర్కిల్ పరిధిలో 750 మంది, వాంకిడి సర్కిల్ పరిధిలో 650 మంది, రెబ్బెన సర్కిల్ పరిధిలో 600 మంది మరియు ఆసిఫాబాద్ సర్కిల్ పరిధిలో 423 మంది విద్యార్థులకు ఈ సామగ్రిని చేరవేశారు. జైనూర్, సిర్పూర్ (యూ), లింగా పూర్, వాంకిడి, కేరమేరి, రెబ్బెన, తీర్యాని పోలీస్ స్టేషన్ల పరిధిలోని మారుమూల ప్రాంత విద్యార్థులు ఈ సహాయం ద్వారా లబ్ధి పొందారు. ఈ సందర్భంగా ఏఎస్పీ చిత్తరంజన్ మాట్లాడుతూ పదవ తరగతి అనేది విద్యార్థుల జీవితంలో అత్యంత కీలకమైన మైలురాయి అని అభివర్ణించారు. ఈ దశలో పడే కష్టం భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి బలమైన పునాదిగా మారుతుందని పేర్కొన్నారు. గిరిజన ప్రాంత విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదివి సమాజంలో గౌరవప్రదమైన స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. ఎలాంటి పరీక్షా భయం లేకుండా, క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పేరు నిలబెట్టాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు రమేష్, సత్యనారాయణ, సంజయ్, బాలాజీ వరప్రసాద్ తో పాటు సంబంధిత ఎస్ ఐ లు , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.






# జర్నలిస్టుల వెంటే నేను.. సమస్యల పరిష్కారానికి సిద్ధం

## మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి అహ్మద్

**ప్రజానావ, కాగజ్‌నగర్ :** పట్టణ కేంద్రంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకలో భాగంగా ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి అహ్మద్‌ను ఫెడరేషన్ సభ్యులు పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. అలాగే కాగజ్ నగర్ మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగీర్, బీఆర్ఎస్ నాయకుడు సయ్యద్ నిసార్‌ల ను కూడా శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి అహ్మద్ మాట్లాడుతూ జర్నలిస్టుల వెంటే నేను ఉంటాను, వారి సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా సిద్ధం అని ప్రకటించారు. సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమించే జర్నలిస్టుల సేవలు అభినందనీయమని కొనియాడారు. విధి నిర్వహణలో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తన దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా జర్నలిస్టులందరూ కలిసి ఇలా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం సోదరభావానికి, ఐక్యతకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐ జే యూ) అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ , తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి అబ్దుల్ జమిల్, ఫెడరేషన్ జిల్లా బాధ్యులు ఎం ఎ మాజిద్, మఫ్ఫాఖామ్, సయ్యద్ సోజర్ , ఫెడరేషన్ సభ్యులు వాసి ఖాన్, ఫయాజ్, అహ్మద్ అమీన్, నాసిర్ ఖాన్, మొయిన్, సయ్యద్ షౌకత్ తదితరులు పాల్గొన్నారు.







## ఫౌండేషన్ నిత్య అన్నదానం

**ప్రజానావ, ఆదిలాబాద్:** ఆదిలాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయం ప్రజాభవన్‌లో నిత్యం అన్నదానం నిర్వహిస్తున్నారు. 3సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ కార్యక్రమం ద్వారా రోజువారి కూలీలు, పని నిమిత్తం ఆదిలాబాద్‌కు వచ్చిన చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, నిరుపేదలు లబ్ధి పొందుతున్నారు. ప్రతిరోజు ఆకలితో వచ్చే వారికి కడుపునిండా భోజనం అందిస్తూ కంది శ్రీనివాస్ రెడ్డి ఫౌండేషన్ సేవలను అందిస్తోంది. అన్నదానం ద్వారా కడుపునిండా భోజనం చేసిన వారు కంది శ్రీనివాస్ రెడ్డి సేవలను ప్రశంసిస్తూ ఆశీర్వాదాలు అందజేస్తున్నారు. సమాజంలో సేవాభావంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



## మంచినీటి ట్యాంకర్ల శుద్ధి

**ప్రజానావ, గుడిహత్నూర్:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మండలంలోని డోంగర్‌గావ్ గ్రామంలో మిషన్ భగీరథ అధికారులు ప్రణయ్, వెంకటరమణలతో కలిసి గ్రామంలోని అన్ని వార్డులను బుధవారం గ్రామ సర్పంచ్ అబ్దుల్ రెహమాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో మంచినీటి సరఫరా పరిస్థితిని పరిశీలించి, మంచినీటి ట్యాంకర్లను శుద్ధి చేయించారు. అలాగే గ్రామంలో ఉన్న నీటి సరఫరా సమస్యలపై అధికారులతో చర్చించారు. ప్రతి ఇంటికి సురక్షితమైన మంచినీటి సౌకర్యం అందేలా చర్యలు చేపడతామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పంపిణీ



**ప్రజానావ, సత్తుపల్లి:** సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామంలోని ప్రభుత్వ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఆశా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న 60 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సందర్భంగా ఉపయోగపడే ప్యాడ్స్‌ను పంపిణీ చేశారు. రాబోయే పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే ఆకాంక్షిస్తూ వారికి 'ఆల్ ది బెస్ట్' తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఎంఈఓ రాజేశ్వర్ రావు, ఉప సర్పంచ్ రాధాకృష్ణ, మాజీ ఎంపీపీ చల్లారి వెంకటేశ్వరరావు, కిసాన్ అధ్యక్షుడు కంచర్ల రమేష్, కాంగ్రెస్ నాయకులు పువ్వుల ఉమా, కిలారి కేశవరావు, కిలారి వెంకటేశ్వరరావు, యూత్ అధ్యక్షుడు తమ్మిశెట్టి గణేష్ బాబు, వార్డ్ మెంబర్లు, సెక్రటరీ, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'భారతీయ మహిళా'పుస్తక పరీక్షలో విద్యార్థుల ప్రతిభ



**ప్రజానావ, సత్తుపల్లి:** శ్రీ రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ తెలంగాణ, శ్రీ రామకృష్ణ సేవా సమితి సత్తుపల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన "భారతీయ మహిళా"పుస్తకంపై పరీక్షలో సత్తుపల్లి డివిజన్ స్థాయిలో పలువురు విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ పరీక్షలో ముప్పాళ కావ్య ప్రథమ బహుమతి, కొట్టే మౌనిష, చిన్నంశెట్టి లాస్య శ్రీ తృతీయ బహుమతులు సాధించారు. అదేవిధంగా అత్యుత్తమ ప్రతిభ కనబర్చిచిన షేక్ ఆస్పియా, షేక్ ఆరీఫా, ఎండి సానియాలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. విజేతలకు గంగారాం 15వ బెటాలియన్ కమాండెంట్ అంజయ్య, సత్తుపల్లి మండల విద్యాశాఖ అధికారి రాజేశ్వరరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. విజేతలను టాలెంట్ స్కూల్ కరెస్పాండెంట్ పులి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పులి అరుణ అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఇంచార్జ్ శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మంత్రి తుమ్మలపై అసత్య ప్రచారం సిగ్గుచేటు

**ప్రజానావ, వేంసూర్:** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాన్ని తీవ్రంగా ఖండించాల్సిన విషయమని భరణిపాడు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో నైతిక విలువలు, నిజాయితీకి కట్టుబడి పనిచేసిన నాయకుడిపై ఆధారంలేని ఆరోపణలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. నలుగురు ముఖ్యమంత్రుల వద్ద క్యాబినెట్ మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర రాజకీయాల్లో మచ్చలేని నాయకుడిగా గుర్తింపు పొందారని తెలిపారు. ప్రజాసేవే ధ్యేయంగా ముందుకు సాగుతున్న వ్యక్తిని ఉద్దేశపూర్వకంగా విమర్శించడం వెనుక రాజకీయ దురుద్దేశ్యాలు ఉన్నాయని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో భూదాన్ భూములను ఆక్రమించి విక్రయించేందుకు ప్రయత్నించిన నాయకులే ఇప్పుడు నీతిపాఠాలు చెప్పడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. తుమ్మల రాజకీయ ప్రస్థానంలో ఎలాంటి మచ్చలు లేవని, ప్రజల విశ్వాసం ఆయనకు బలమని స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారం చేయడం మానుకుని వాస్తవాలు గ్రహించాలని సూచించారు.

